"వైదేహీ! మా అత్తగారెంత తెలివైందో, మొన్న సంక్రాంతి సెలవులకి భీమవరం మా అత్తగారింటికి వెళ్లినప్పుడే తెలిసింది."

పరిమళా, వైదేహీ చాలా కాలంగా ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. ఆ రోజు ఇద్దరికీ ఓవర్ టైం డ్యూటీ పడింది. డ్యూటీ ముగించుకుని ఇళ్లకు బయలు దేరేసరికి రాత్రి ఎనిమిది అవుతోంది. పరిమళ ఇల్లు కూడా వైదేహి ఇంటి వైపే కావడంతో పరస్పరం కుటుంబస్థితిగతులు, కష్ట సుఖాలు ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు చెప్పుకోవడం అలవాటు ఇద్దరికీ.

పరిమళ చేతులు తిప్పుతూ చెప్తోంటే, చిరుదరహాసంతో వింటోంది వైదేహి.


'ఇంతకీ మా అత్తగారు ఏం చేసిందీ అని అడగవేం?'

'నేనడక్కపోయినా మా ఇల్లు వచ్చే లోగా నువ్వెలాగూ చెప్తావు కదా పరిమళా!'

"నీక్కాకపోతే ఎవరికి చెప్పుకోగలను? మా ఆయనో సత్తెకాలం మనిషి. అంతా మంచివాళ్లే ననుకుంటారు. అందరి మనసులూ నిష్కల్మషమైనవేనని ఆయన ఉద్దేశం. కాని ఈ విషయం విని ఆయనా కాస్త తెల్లబోయారనుకో. అయినా ఎప్పటిలాగే ఓ చిరునవ్వు నా మొహాన విసిరేసి టీవీ చూస్తున్నట్లు నటించేశారు. ఎంతైనా వాళ్లూ వాళ్లూ ఒకటే కదా. ఇద్ద రాడపిల్ల లున్నారు. ఈయనగారికి ఎప్పటికి తెలివొస్తుందో కదా!" అంటూ నిట్టూర్చింది పరిమళ.

# ఇయం సీతా మమ సుతా...

**- పి.వి.శేషారత్నం**



వైదేహికి కుతూహలం ఆగలేదు. మరో ఐదు నిమిషాల్లో తన ఇల్లు వచ్చేస్తుంది. ఈ లోగా పరిమళ వరస చూస్తుంటే విషయం తెగేలా లేదు. అందుకే అంది, "అత్తగారి తెలివి గురించి చెప్తానని మీ ఆయన గురించి వ్యాఖ్యానాలు చేస్తావేంటి తల్లీ? అసలు విషయం చెప్పడానికి ముందు నీకు ఉపోద్ఘాతం ఎక్కువేలే."

"ఆ అక్కడికే వస్తున్నాను వైదేహీ. మా అత్తారింట్లో ఆమధ్య పిత్రార్జితాన్ని పంచుకుంటూ మాకు కూడా ఒక వాటా రాసిచ్చారు కదా! దాన్ని నాలుగేళ్ల క్రితం అద్దెకి కూడా ఇచ్చాం. నెలకి రెండు వేలు. ఈ నాలుగేళ్లుగా మా ఆయన ఒక్క రూపాయ కంట చూసిన పాపాన పోలేదంటే నమ్ము. మొన్న పండక్కి వెళ్లినపుడు ఉండబట్టలేక నేను మా తోటికోడలితో అంటే, అప్పుడు తెలిసింది విషయం. నెల నెలా ఆ అద్దెని మా అత్తగారు తీసుకుని బ్యాంకులో వేయించుకుంటూ ఏడాదిలో జత గాజులు, ఉంగరం, గొలుసు, దుద్దులు- ఇలా రకరకాలుగా ఆభరణాలు చేయించు కుంటున్నారుట."

వైదేహి నవ్వింది.' మనవరాళ్ల కోసం అనుకోరాదూ!'

'ఆ... ఆశ దోశ... అప్పడం దప్పళం. డబ్బు రూపంలో మా ఆడపడుచుల కిస్తే అందరికీ తెలుస్తుందని, నగల రూపంలో ఇలా ఊరుకొని ఇలా కూడబెడుతోందన్న మాట. అమ్మ నగలు కూతుళ్లకేగా చివరికి దక్కేది? మనకా పాటి తెలివితేటలే వుంటే ఇలా ఊరు గాని ఊళ్లలో ఉద్యోగాలు చేసుకుంటూ ఎందుకు



అవస్థలు పడతామూ? మా పిచ్చి మారాజు కివన్నీ పట్టవు."

వైదేహి నోరు తెరచి ఏదో అనబోయేంతలోనే పరిమళే మళ్లీ అంది.

"ఏడాదికి పాతికవేలు వాడు కుంటున్నా ఇంకా మేమేదో సరిగ్గా చూడకుండా బాధ్యతల నుండి తప్పించుకునేందుకే ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నామని మా మావగారు, అత్తగారు అడిగినవాళ్లకీ అడగనివాళ్లకీ చెప్పడం, ఏడవడం... మీ అంతా నీలాంటి అదృష్టవంతు లుంటారా వైదేహీ? మీ మావగారు నిజంగా దేవుడే. మావగారు దొరకడం నువ్వు చేసుకున్న పూర్వజన్మ సుకృతమే" అంది.

ఎందుకో మనసు కలుక్కుమనిపించింది వైదేహికి.

వైదేహి ఇంటి అరుగు మీద వాళ్ల మావగారు కనపడకపోయేసరికి, "అవునూ... మీ మావ గారికి ఒంట్లో బాగా లేదా ఏమిటి వైదేహీ? లేకపోతే ఈ పాటికి నీ కోసం అరుగు మీద పచార్లు చేస్తూ కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటారు కదూ?" అంది పరిమళ వెళ్తూ, అటూ ఇటూ చూస్తూ.

వైదేహి బలవంతాన తొట్రుపాటును అణచుకుంది.

"అది సరే గాని పరిమళా, రేపు మా కిరణ కోసం మీ వాడి హిందీ నోట్సు తేవడం మరిచిపోకు సుమా! ఒక్క రోజులో ఇచ్చేస్తాడు కాపీ చేసుకుని. ఏం లెక్చరర్లో ఏంటో... మొదట్నుంచీ వీడికి హిందీ అంటేనే భయం. వాళ్లేమో అర్థమయేలా చెప్పరు" అంటూ తన యింటి మెట్లెక్కింది, పరిమళకు చెయ్యూపుతూ.

హాల్లో కూర్చుని హోం వర్కు చేసుకుంటోంది కూతురు సుమ. పెద్దవాడు కిరణ్ ఇంకా ప్రయివేటు క్లాసు నుంచి వచ్చినట్టు లేదు. భర్త ప్రసాద్ తీరిగ్గా టీవీ చూస్తున్నాడు.

ఆ సమయంలో ఇంట్లో తను గాక ఇద్దరున్నా ఏదో లోపించి నట్టనిపించింది వైదేహికి. అదేమిటో ఆమెకు బాగా తెలిసిందే. మావగారు సుబ్బారావుగారిని, సాయంత్రమే పినమావగారి ఊరికి రైలెక్కించారు. ఆయన ఇంట్లో ఉంటే ఈ పాటికి పరిమళ చెప్పినట్లు తన కోసం వీధి అరుగు మీద కాలుగాలిన పిల్లిలా పచార్లు చెయ్యడమో, లేక ఇంట్లో ఏదో ఒకటి ఎత్తేసి మనవరాలితోనో, కిరణ్ ఇంట్లో ఉంటే వాడితోనో, వాదులాడుతూ ఉండేవారే.

ఆ సమయంలో ఇంట్లో తను గాక ఇద్దరున్నా ఏదో లోపించి నట్టనిపించింది వైదేహికి. అదేమిటో ఆమెకు బాగా తెలిసిందే. మావగారు సుబ్బారావుగారిని, సాయంత్రమే పినమావగారి ఊరికి రైలెక్కించారు. ఆయన ఇంట్లో ఉంటే ఈ పాటికి పరిమళ చెప్పినట్లు తన కోసం వీధి అరుగు మీద కాలుగాలిన పిల్లిలా పచార్లు చెయ్యడమో, లేక ఇంట్లో ఏదో ఒకటి ఎత్తేసి మనవరాలితోనో, కిరణ్ ఇంట్లో ఉంటే వాడితోనో, వాదులాడుతూ ఉండేవారే.

తాతగారు ఏదైనా తినమని ఒత్తిడి చేస్తే సుమకి కోపం. టీనేజ్‌లో ఉన్న పిల్ల. అందుకే ఈ మధ్య ఫిగర్ కాన్షస్ ఎక్కువయింది. "దానికి ఆకలేస్తే అదే తింటుంది. మీరేం తినమని ఫోర్సు చెయ్యకడి మావయ్యా!" అంటే ఆయన వినరు.

"నీకు తెలియదమ్మా సరిగ్గా తిండి తినకపోతే లేని పోని రోగాలొస్తాయి. వాళ్ల నాన్న టూర్ల మీదుంటాడు. మనిద్దరమేగా బాధ పడాల్సింది!" అనేస్తారు.

చెప్పులు విడుస్తున్న తల్లికేసి, సుమ ఓ సారి తలెత్తి చూసి పుస్తకం మూసేస్తూ "అమ్మా బోరు కొడుతోందే, ఇంక చదవడం నా వల్ల కాదు బాబూ..." అనేసి తండ్రితో పాటు టీవీ ముందుకు చేరిపోయింది.

వైదేహి మనసు కలుక్కుమంది. 'కూతురికి ఎందుకు బోరు కొడుతోందో కూడా తనకి తెలుసు. తన భర్త ఎప్పుడూ టూర్ల మీద తిరుగుతూనే ఉంటారు. ఇంట్లో ఉండేది తమ నలుగురే. మావగా రుంటే పదిమంది పెట్టు.

'ఇవాళ ఇంత ఆలస్యమయిందేమమ్మాయ్...?'

ఓవర్ టైం పడే ఉద్యోగం తనది. అది అయ్యాక ఎనిమిదింటికే తను వస్తుందని తెలిసినా, రోజూ అలవాటుగా ఆయన అడిగే ప్రశ్న అది.

'అమ్మాయ్ వైదేహీ... ఇవాళేమైందో తెలుసా?' అంటూ తను కాళ్లు చేతులు కడుక్కుంటూంటేనో, వంటింట్లో వంట ఏర్పాట్లు చేస్తుంటేనో, ఆ రోజులో చుట్టు పక్కల జరిగిన విశేషాలు, పిల్లలు తన మాట వినకుండా ఎంత కాల్చుకు తిన్నారో ఆ విషయాలు, తన కోసం ఎవ రెవరు ఫోన్లు చేశారో... అవన్నీ ఏకరువు పెట్టేవారు.

అలా చెబుతూనే, 'పిల్లలతో పాటు నాకు ఇవాళ హార్లిక్స్ వద్దమ్మాయ్. నువ్వు కలుపుకునే చుక్కే కాస్త ఇయ్యి సరిపోతుంది. అన్నట్లు రాత్రికేం వండుదామనుకుంటున్నావు? బెండకాయ నువ్వుల పొడి వేసి చెయ్యి. నాకు వేడి చేస్తుందని మీరు మానుకోకండి. కిరణ్‌గాడికి అదంటే ప్రాణం. అన్నట్లు జ్వరం వచ్చి తగ్గాక నోరు బాగా చచ్చిపోయినట్టుంది. కాస్త పాత నిమ్మ కాయ పచ్చట్లో ఇన్ని మెంతిగింజలూ, ఆవాలు పోపు పడెయ్యి. కాస్త ఇంగువ చారు పెట్టు. పులుసు పెట్టాలనేమీ లేదులే. ఇందాక మధ్యాహ్నం మన వీధిలోకొస్తే నవనవలాడుతోంది కదాని రేపు పులుసులోకి పనికొస్తుందని తోటకూర తీసుకున్నాను.'


'ఇవాళ సుమకి ప్రోగ్రెస్ రిపోర్టు ఇచ్చారుట. లెక్కల్లో బాగా తక్కువ వచ్చాయమ్మాయ్. దాన్ని గట్టిగా ఏమీ అనకు. పాపం పేపరు కఠినంగా ఇస్తే అది మాత్రం ఏం చేస్తుంది? అసలు వాళ్ల క్లాసులో ఎవరికీ నలభై మార్కులు దాటలేదుటలే. దీనికి పదో-పన్నెండో వచ్చినట్టున్నాయి. ఈ సారి మా వాడికి గట్టిగా చెప్పాలే ప్రయివేటు మాస్టారి నెవరినైనా చూడమని.'

'అన్నట్లు మీ పరిమళ చిన్న కూతురికి కామెర్లు తగ్గాయా? పసరు మందులు పోయిస్తున్నానని చెప్తే చదువుకున్నవాళ్లే ఇలా చేస్తే ఎలాగమ్మా అని మొన్న మందలించాను. ఇంతకీ డాక్టరు దగ్గరికి తీసికెళ్లిందా?'

'బందరులో ఉన్న మీ తమ్ముడి బావమరిది కూతురికి దిష్టి వల్ల బాగా జ్వరం వచ్చిందంటే, ఇవాళ గుళ్లో ఆంజనేయస్వామికి ఆ పిల్ల పేర పూజ చేయించి గంగ సిందూరాన్ని పోస్టులో పంపాను వైదేహీ!'

ఇలా ఉండుండి జ్ఞాపకం వచ్చిన మాటల్లా మాట్లాడుతూ వెనక వెనకే తిరిగేవారు. ఇవన్నీ బాగానే ఉన్నాయి. కాని ఈ మధ్య జ్వరం వచ్చి తగ్గాక ఆయనకి బాగా చాదస్తం ఎక్కువైపోయి తనని విసిగించడం పెరిగిపోయింది.

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-
ఎ.ఎ.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో
రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ



పొద్దున్నన్నగా పోయిన తను నడుం విరిగేలా ఆఫీసులో అరవ చాకిరీ చేసి తలనొప్పితో ఇంట కొచ్చేసరికి... ఇంట్లో రోజూ ఓ అద్దమో, గాజు గ్లాసో, పింగాణీ పేట్లో పగలగొట్టడం... లేదా ఏ కాలో మెలికపడి పడిపోవడంతో ఆయన నొప్పి భరించలేక కేకలూ... మూలుగులూ... ఏవీ తియ్యొద్దంటే వినరు.

'నీకు డెబ్బయ్యేళ్లు వచ్చాయి. ఇదివరకులా బయటికి తిరగకు నాన్నా. పడిపోతే ఏ ఎముకైనా విరిగిదంటే ఈ వయసులో కష్టం. ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి పట్టునే ఉండు. నేనా ఊళ్లో ఉండను. ఇటు నిన్నూ అటు పిల్లలనీ, చూసుకుంటూ మరో పక్క ఆఫీసు అంటే నీ కోడలికి కష్టం' అంటూ కొడుకు చెప్పినా ఆయనటు ఊరెళ్లగానే, ఇటు, గుడికనో, పార్కుకనో వెళ్లడం, చీకటి పడుతుంటే ఏ రాయో తగిలి కాలికో వేలుకో దెబ్బ తగిలించుకుని రాత్రంతా మూలగడం, తనకి మరింత తలనొప్పి కలిగిస్తున్నాయి. దానికి తోడు తనకీ ఏడాది క్రితం ఆపరేషన్ అయినప్పటి నుంచీ కాస్త ఎక్కువ శ్రమ పడితే పొత్తి కడుపులో నొప్పి.

వీటన్నింటి మధ్యా ఆయనకి ఈ మధ్య తరచూ అరుగుదల తక్కువై విరేచనాలు, తరచూ మూత్రానికి పోవడం ఎక్కువైపోయాయి. పెద్దతనం వచ్చేయడం వల్ల కంట్రోలు కూడా తప్పిపోయి ఒక్కోసారి తెలియకుండానే బట్టల్లో అయిపోవడమో, హాలు నుంచి ఆయన గదిలోకి బాత్ రూంకి వెళ్లే దారిలోనే పోసెయ్యడమో జరుగుతూండ డంతో, ఇల్లంతా ఒకటే వాసన. పిల్లలు విసుక్కోవడం, తాతగారితో పోట్లాట, ఆయనా వాళ్లతో సమానంగా అరవడం. ఎంత పనిమనిషి ఉన్నా 24 గంటలూ ఉండదుగా. ఒకోసారి శుభ్రం చేసే పని తన మీదే పడి ఇటీవల జీవితమంటేనే విరక్తి వచ్చేస్తోంది. అందుకే కోపంతో అరవాల్సి వస్తోంది.

తను ఎన్ని కేక లేసినా బుద్ధిమంతుడైన బాలుడిలా ఊరుకుంటారు తప్ప ఎదురు చెప్పరు. కొడుకుతో చాడీలు చెప్పరు. అది మాత్రం సుగుణమే. భర్తకీ ఇవన్నీ తెలుసు. కాని ఏం చెయ్యగలరు? బావగార్లిద్దరూ ఏ నాడో ఫారిన్‌లో సెటిలయ్యారు. ముసలాయనను ఫోనులో పలకరించడమో, నాలుగేళ్ల కో సారి చుట్టం చూపుగా రావడమో. అందుకే మావగారు తమ దగ్గరే ఉండక తప్పదు. అదీ గాక ఎక్కడికైనా ఓ నాలుగు రోజుండాలని వెళ్లినా అలవాటై పోయిన మనవలు కనిపించకపోతే, తోచక మర్నాటికే తిరుగు ప్రయాణం కట్టేస్తారు.

ఇప్పటి దాకా ఆయన విషయం ఏమీ అనిపించలేదు గాని, ఇప్పుడు ప్రాణం విసిగిపోతోంది. భర్త ఊళ్లో లేడు కదా అని ఏ ఊరగాయతోనో సరిపెట్టుకుందామంటే కుదరదు ఆయనకి. రెండు పూటలా మావగారికి కూర, పచ్చడి, చారో, పులుసో ఉండాల్సిందే. 'ఇవాళ పొట్లకాయ పెరుగు పచ్చడి ఎంత బాగా కుదిరిందమ్మాయ్. మీ అత్తగారు అచ్చం ఇలాగే చేసేది' అనే ఆయన పొగడ్తలకి మొదట్లో తను ఉబ్బిపోయినా, రానురాను ఆయన జిహ్వాచాపల్యానికి చిరా కొచ్చేస్తోంది.

అసలు ఆఫీసు నుండి ఇంటికి రాగానే తనకి ఓ గంట కళ్లు మూసుకుని పడుకుంటే బాగుండు ననిపిస్తుంది. కాని అరగంటైనా గడవక ముందే తనకి సాయం పేరుతో ఆయనే ఫ్రిజ్ లోంచి కూరలు బయటికి తియ్యడమో, కత్తి పీటను ఎత్తేయడమో చేస్తుంటే ఎంత కోపం వస్తుందో. అది గాని కాలి మీద పడితే ఇంకేమైనా ఉందా? ఆయన చేష్టలతో రాను రాను తనకి హార్ట్ అటాక్ వచ్చేలా అనిపిస్తోంది.

ఆరు నెలలుగా ఇదే తంతు. మావగారికే ఏదయినా అయిందో... తనకే కోపం ఎక్కువయిందో...

ఇవి చాలక పిల్లల పోట్లాటలు... మధ్యలో ఆయన కలగజేసుకోవడం, పిల్లలు అలకలు భార్యా, భర్తా ఇద్దరూ ఒకచోట ఉద్యోగం చేసేవారైతే, వీటన్నిటినీ పంచుకోవడానికి వీలుండేది. కాని తమకా అదృష్టం లేదు. నెలకి ఇరవై రోజులు భర్త ఊళ్లో ఉండక పోవడంతో కిరాణా కొట్టు నుండి ఆస్పత్రి వరకు అన్నీ తనే చూసుకోవాలి. ఆరోగ్యంగా మామూలుగా ఉన్నంత సేపూ పరవాలేదు గాని, మావగారికి చిన్నపాటి జ్వరమొచ్చినా, దగ్గొచ్చినా, జలుబొచ్చినా, తన కింక పిలు పొచ్చేసిందేమోనని కొడుక్కి ఫోన్ చేసెయ్య మని ప్రాణభయంతో గొప్ప హడావుడి చేస్తారు. ఎలాగో తనే మందులు వేసి పడుకో బెడుతుంది.

ఈ మధ్య ఓ ఏడాది నుండి మరో చిక్కు వచ్చిపడింది. కిరణ్ కాలేజీకి, సుమ టెన్త్ క్లాసుకి వచ్చేయడంతో, తనకి ఆఫీసులో పని ఎక్కువవడంతో ఇంట్లో ఒంటరితనం భరించ లేకో ఏమో మరి, మావగారు తన పెన్షనంతా ఫోన్‌లకి ఖర్చు పెట్టేస్తుండడమే కాదు, అప్పుడప్పుడూ అవి చాలక తన దగ్గరో భర్త దగ్గరో అడిగి తీసుకోవడం ఎక్కువైపోయింది. తనది కంఠశోషే అయింది తప్ప, భర్త ప్రసాద్ దాన్ని ఎంతో తేలికగా తీసుకున్నాడు.

'పోనిద్దూ... అంతకు ముందైనా పిల్లలకో, ఇంట్లోకో ఖర్చు పెట్టేవారు. ఇప్పుడు మనిషి కంఠం కోసం మొహం వాచిపోయి స్నేహితు లని ఏర్పరచుకునట్టున్నారు.'

ఒక్క స్నేహితులే అని ఏమిటి... ఎక్కడెక్కడి దూరబంధువుల ఫోన్ నంబర్లు సేకరించి, వాళ్లని రోజూ ఫోన్ చేసి పలకరించడం, వాళ్ల యోగక్షేమాలన్నీ కనుక్కోవడం, ఇబ్బందుల్లో ఉంటే ఓదార్చడం, అసలు ఫోనులో, వాళ్లు ఆయనను గుర్తు పట్టేసరికి బోలెడు బిల్లు. వాళ్లందరికీ ఆయనంటే పంచప్రాణాలు. సెలవొస్తే చాలు... లేదా రాత్రి అయితే చాలు, ఎవరెవరో ఫోన్ చేసి 'సుబ్బారావుగా రున్నారామ్మా? ఏం లేదు మా మనవరాలికి దగ్గు తగ్గగానే ఫోన్ చెయ్యమన్నారు. లేకపోతే పాపం ఆయన ఎంతో ఖర్చు పెట్టి మళ్లీ చేస్తారని చేస్తున్నానమ్మా!'

'నేనెవరో నీకు తెలియదులేమ్మా. మీ మావగారి తమ్ముడికి వేలు విడిచిన మేనమామ కొడుకుని. ఈ రోజే షేము తిరపతి నుంచి క్షేమంగా ఇంటికి చేరామని చెప్పమ్మా.'

'వైదేహీ, మా తోడల్లుడి మనవడికి ఆ రాజమండ్రి సంబంధం కుదిరిందని చెప్పు. ఆయన సంబరపడతారు' అంటూ తన

అన్నయ్య.

'చూడమ్మా, మా అబ్బాయి జన్మనక్షత్రం అడిగారు మీ మావగారు. వాడి గ్రహస్థితి బాగు పడేందుకు శనికి తైలాభిషేకం చేయిస్తామని చెప్పారు. వాడిది మఖనక్షత్రమని చెప్పమ్మా.'

తను స్కూలుకి వెళ్లక ముందు, వెళ్లొచ్చాకే ఇన్ని ఫోన్లు వస్తుంటాయి. ఇక తను లేనప్పుడు ఆయన ఎన్ని ఫోన్లు చేస్తారో, అవతలివాళ్లు ఈయనకు ఎన్ని చేస్తారో!

చుట్టుపక్కల బంధువర్గాల్లో మాత్రం 'మీ మావగారికి మేమంటే ఎంత అభిమానమమ్మా. ఇప్పుడంతా డబ్బు ప్రపంచమే తప్ప పొరుగువాళ్ల గురించి పట్టించుకునే తీరిక ఎవరికుంది? మొన్న మా అబ్బాయి రిక్షా లోంచి పడిపోతే తనే దగ్గరుండి ఆస్పత్రికి తీసికెళ్లి కట్టు కట్టించుకొచ్చారు మారాజు.'

'ఇదిగోనమ్మగారూ! యాభై రూపాయలు నిన్న ఫోన్ చెయ్యడానికొచ్చి తాతగారు చిల్లర తీసుకోవడం మరిచిపోయా'రంటూ వీధి చివరి ఎస్టీడీ ఎక్సేంజి కుర్రాడు అప్పుడప్పుడు డబ్బులిచ్చి వెళ్తుండేవాడు. బిల్లు ఎక్కువొస్తే తిడతారనో ఏమో, ఇంట్లో ఫోన్ నుంచి మాత్రం చేయడం లేదు. కాని ఆయనను కాంటాక్ట్ చెయ్యడానికి మాత్రం ఇంటి నంబరిస్తారు. చాలా రోజుల వరకు తనకీ తెలియదు. ఈ మధ్య ఒంట్లో బాగు లేక నాలుగు రోజులు సెలవు పెడితే ఎక్కెడెక్కడి బంధువులు, తను ముక్కు మొహం ఎరగనివాళ్లు కూడా ఫోన్ చేస్తుంటే తనకి మతి పోయింది. చివరికి ఆయననే అడిగితే చెప్పారు. 'పాపం వాళ్లని చూస్తే జాలేస్తుందమ్మాయ్. మానవులం మనమే ఒకరినొకరు సాయం చేసుకోకపోతే ఎలాగమ్మా?' అని లోకక్షేమమంతా తన మీదే ఆధారపడి ఉన్నట్లు గాఢమైన నిటూర్పులు.

ఆయన విశాలహృదయానికి సంతోషించాలో, వాళ్లందరికీ ఆయన లేనప్పుడు సమాధానాలు ఇవ్వలేక అవస్థ పడాలో అర్థం కావడం లేదు. మొన్న భర్త రాగానే ఉండబట్టలేక తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది.

'వైదేహీ ఏం చేస్తాం చెప్పు. ఆయనకి పెద్దతనం వచ్చేసింది. వార్ధక్యం అంటేనే మరో బాల్యం. ఆయనను మన మూడో సంతానంగా చూడడం తప్ప ఏం చెయ్యగలం చెప్పు. అయినా విచక్షణ గలదానివి నీకు నేను బోధించాల్సిన పనేముంది?'

'మీరన్నది నేను కాదనను. ఇన్నేళ్లూ చెయ్యలేదా? కానీ నాకు ఓపిక ఉండడం లేదు. ఎపుడన్నా రాత్రి ఏమో మజ్జిగ తాగి పడుకుందామంటే ఆయనకు అన్నీ ఉంటే కాని ముద్ద దిగదు. నాకేమో ఇంటికొచ్చేసరికే ఎనిమిదై పోతోంది. ఒక వైపు మా బాస్ సతాయింపులు, ఇన్స్పెక్షన్లు, వర్క్ లోడ్. నేనూ మనిషినేగా, నాకు విశ్రాంతి అవసరం లేదంటారా? పైగా పిల్లలతో సమానంగా పోట్లాటలు ఎక్కువైపోయాయి. ఏదో దెబ్బ తగిలించుకోవడం, రాత్రంతా నిద్ర పట్టక గోల గోల. నేను గట్టిగా కేకలేస్తే తప్ప పడుకోరు. నిద్ర కూడా తక్కువైపోయి మరీ చికాకు పెట్టేస్తున్నారు. నాలుగు రోజులు ఆయనను ఎక్కడకైనా పంపకూడదా ? మీ చెల్లెళ్ల దగ్గరకెళ్లినా రెండు రోజులైనా ఉండరు.'

'కోడలిని, మనవల్ని వదిలిపెట్టి ఉండలేనంత బాగా చూస్తున్నావాయె.'

భర్త పరాచికానికి ఎప్పటిలా నవ్వు రాలేదు తనకి. ఉక్రోషం పట్టలేక ఏడ్చేసింది.

చివరికి తన పోరు పడలేక అన్నాడు భర్త, 'బాగా గుర్తు చేశావు వైదేహీ! అన్నట్లు మా చిన్నాన్న షష్టిపూర్తికి నాలుగు రోజులు ముందుగా పంపమని ఉత్తరం కూడా రాశారుగా. పంపిద్దాంలే' అని.

మర్నాడు ముసలాయనకు ప్రయాణం విషయం చెప్పేసరికి ఆయన గలగలా నవ్వుతూ కొట్టి పారేశారు.

'ఆ నా మొహం, ఇప్పుడు షష్టిపూర్తేమిటి వాడికి? నాకూ, వాడికీ ఐదేళ్లేగా తేడా?'

తను కలగజేసుకుని సర్ది చెప్పింది. 'మావయ్యగారూ! ఇప్పుడు షష్టిపూర్తి అంటే అరవయేళ్లకి చేసుకోవాలని కాదు లెండి. వాళ్లబ్బాయిలు ఫారిన్ నుంచి వచ్చారు కదా. వాళ్లు అందరి ఇళ్లకూ వెళ్లి పలకరించడం కష్టం కనుక, అందరినీ ఈ వంకతో చూసినట్టవుతుందని ఈ మధ్యన అందరూ ఇలా ఏదో ఒక ఫంక్షన్ ఏర్పాటు చేస్తున్నారు.'

'నిజమేనమ్మాయ్. అయితే మా తమ్ముడి కొడుకులు చంద్రాన్నీ, వెంకటేశాన్నీ చూసి పదేళ్లయిపోయిందేమో, వెళ్తాలే. వాళ్లూ సంతోషిస్తారు. టిక్కెట్టు తీసెయ్యరా ప్రసాదూ!' అంటూ గ్రీన్ సిగ్నలిచ్చేశారు మావగారు.

తను భారం తీరినట్టు తేలికగా నిట్టూర్చింది ఇంక ఓ పదిహేను రోజులు తనకి విశ్రాంతి.

'ఎపుడో తీసేశాను నాన్నా. ఆ మధ్యనో రోజు రాత్రి చిన్నాన్న, నిన్నో పదిహేను రోజులుంచుకుంటానని, ముందుగా పంపమని మరీ మరీ చెప్పాడు ఫోన్ చేసి.' చిన్న అబద్ధం ఆడాడు భర్త.

జ్వరంతో బలహీనపడిన ఆయన అంత దూరం ప్రయాణం చెయ్యగలడా అంటున్న అంతరాత్మ నోటిని తనే బలవంతాన నొక్కేసింది. ఎలా వెతికి పట్టుకున్నారో గాని, తెలిసున్న బంధువు ఆ వూరు వెళ్తోంటే, ఆయనతో కలిపి భర్త సాయంత్రమే ట్రెయిన్ ఎక్కించాడు మావగారిని.

అందుకే ఇందాక పరిమళకు ఆయన కనిపించలేదు. లేకపోతే పరిమళను కూడా పలకరించి ఇంటి సమాచారమంతా అడిగే వారే ఎప్పటిలా.

భర్త ఇంటికి వచ్చినపుడల్లా, 'ఏరా ప్రసాదూ! అలా దగ్గుతున్నావేంటిరా? కాస్త కరక్కాయ బుగ్గన పెట్టుకో నాయనా!' అనో, 'కాస్త మీ బాస్‌ని ఈ తిరుగుడు ఉద్యోగం నుంచి తప్పించమని అడక్కూడదట్రా? ఇన్నేళ్లు తిరిగావు. కాస్త నీడ పట్టున ఉండే ఉద్యోగంలోకి మారరాదూ? లేకపోతే నన్నొచ్చి మాట్లాడమన్నావా?' అంటూ కొడుకు చుట్టూ తిరిగే మావగారు ఇంట్లో లేకపోయినా, తన కోరుకున్నట్టు స్వేచ్ఛగా

'వైదేహీ ఏం చేస్తాం చెప్పు. ఆయనకి పెద్దతనం వచ్చేసింది. వార్ధక్యం అంటేనే మరో బాల్యం. ఆయనను మన మూడో సంతానంగా చూడడం తప్ప ఏం చెయ్యగలం చెప్పు. అయినా విచక్షణ గలదానివి నీకు నేను బోధించాల్సిన పనేముంది?'

అనిపించలేదు వైదేహికి, ఎందుకో.

'అదేమిటోయ్ అలా డల్‌గా ఉన్నావ్. ఒంట్లో బాగా లేదా?' భర్త ఆపాయ్యంగా అడుగుతున్నా, మనసు ఏదోలా అయిపోయింది వైదేహికి.

'నేను తప్పు చేశానంటారా?' అంటున్న వైదేహి నోరు సున్నితంగా మూశాడు ప్రసాద్.

'వైదేహీ, నువ్వూ మానవమాత్రురాలివేగా. నేనసలు ఎప్పుడూ నీ విశ్రాంతి గురించి ఆలోచించకపోవడం కూడా నా తప్పే. నీకు మాత్రం శక్తి ఎక్కడిది? నాలుగు రోజులు విశ్రాంతి దొరికితే మళ్లీ పూర్వబలం పుంజుకోగలుగుతావు.'

మర్నాడు తెల్లవారు జామున ప్రసాద్ టూర్ వెళ్లిపోయాడు.

ఆఫీసుకి వెళ్లి వచ్చిందే గాని, వైదేహి మనసు మనసులో లేదు. యాదృచ్ఛికంగానే అయినా, ఆ రోజు లంచ్‌లో తన కొలీగ్స్ మావ గారి గురించే మాట్లాడుతుంటే మనసు ఏదోలా అయి పోయింది.

'వైదేహీ, నీ అదృష్టానికి అసూయగా ఉందోయ్! నీకున్న దేవుడి లాంటి మావగారు నాకూ ఉంటే, మరో ఇద్దరు పిల్లల్ని కనేదానిని తెలుసా? ఎక్కడ పెంచి చాకిరీ చెయ్యాల్సి వస్తుందోనని పిడిరాళ్లలా వున్న మా అత్తామామలు, మా పెద్దాడు పుట్టగానే అనారోగ్యం వంక పెట్టి పల్లెటూరికి వెళ్లిపోయారు. పాపం మీ మావగారు చూడు, మీ పిల్లలని పుట్టిన దగ్గర్నుంచీ కంటికి రెప్పలా కాస్తున్నారు. ఒక్క క్షణం వాళ్లు కనపడకపోతే ఆయన ఎంత గిలగిల్లాడిపోతారో చూస్తున్నాం కదా! మా వాళ్లూ ఉన్నారు... ఎందుకూ పైపై ప్రేమలూ, మొక్కుబడి అభిమానాలూను!' అంది టైపిస్టు సుజాత.

సుజాతకి వైదేహి మావగారంటే ప్రత్యేక అభిమానం. వాళ్లాయనకు యాక్సిడెంటైనపుడు, రోజూ పనిగట్టుకుని వెళ్లి మరీ పలకరించి ఏదార్చేవారు సుబ్బారావుగారు.

'వైదేహీ, నీకు ఆపరేషనైనప్పుడైతే, ఇంకా మీ నాన్నగారైనా సిగరెట్టు పీలుస్తూ మామూలుగా రికామెకీగా కనిపించారు గాని, మీ మావగారు 'పెద్దాపరేష నంటే మాటలా? అమ్మాయికి ఎంత బాధగా ఉందో' నని విలవిల్లాడిపోయారనుకో నాకైతే అంత పెద్దాయన అలా కాళ్లూ చేతులూ ఆడక తాపత్రయ పడిపోతోంటే కళ్లమ్మట నీళ్లొచ్చాయంటే నమ్ము.'

'నువ్వు ఇంటికెళ్లడం కాస్త ఆలస్యం అయితే ఆ మధ్య నువ్వు దెబ్బలాడేవరకు ఫోన్ల మీద ఫోన్లు చేసేవారు కాదూ?'

'అంతెందుకు? నీ ఆపరేషను తర్వాత నువ్వు బరువులెత్తకూడదని అంత పెద్దాయన ఇంట్లోకి బకెట్లతో నీళ్లు మోస్తుంటే నా మనసు ద్రవించి పోయిందనుకో వైదేహీ! మీ మామగారు ఊరెళ్లా రంటున్నావు. నీకు తోస్తోందా అసలు?'

వైదేహికి ఇవన్నీ వాళ్లన్నారని కాదు గాని, ఇంట్లో వంద మంది లేనట్టు బావురు మంటోంది. పైగా భర్త ఊళ్లో లేకపోయినా పెద్ద దిక్కులా ఆయనుండడం వల్లే ఇంత వరకు తను భయ మన్నది ఎరగదు. అటువంటిది ఇవాళ ఎందుకో దడదడగా ఉంది. పెద్దగా వంట చెయ్యకపోవడం వలన దొరికిన విశ్రాంతి తనకి ఎందుకో తృప్తినివ్వడం లేదు. పిల్లలు కూడా దెబ్బలాడుకోకుండా స్తబ్ధుగా ఉన్నారు.

పాపం పెద్దాయన, అత్తగారు లేని లోటును కొడుకు కుటుంబం ద్వారా తీర్చుకుంటూ ఒంటరితనాన్ని మరిచిపోయేందుకు పది మందికి ఉపకారం చేస్తూ అందరి క్షేమం కోరుతుండేవాడు.

డెబ్బయి ఏళ్లకే ఆయనను భరించలేకపోతోందే... ఆయన ఆరోగ్యం గట్టిది, వందేళ్లు బ్రతికేస్తే తను చెయ్యగలదా? అని కూడా ఆలోచించింది పాపచింత లేకుండా. తన కొడుకే రేపు వార్ధక్యంలో తన గురించి అలా ఆలోచిస్తే??? ఆ ఊహకే ఎందుకో ఆమె వెన్ను లోంచి చలి పుట్టింది.

జీవితంలో ప్రతి వ్యక్తికీ వార్ధక్యం తప్పదు. ఎన్నో కష్టనష్టాల కోర్చి కని పెంచిన బిడ్డలు, దాన్ని బాల్యంగా అనుకుని వృద్ధులను మరో బిడ్డ అనుకుంటూ సర్దుకు పోతూంటే సమస్యగానే అనిపించదు.

నిజానికి ఆయనకు తను సాయం కాదు, వయసు సహకరించక పోయినా ఆయనే తమకు సాయంగా, కొండంత అండలా ఉంటున్నారు. వయోభారం వల్ల చేతుల్లో పట్టు లేక, తనకి ఇబ్బంది కలిగించ కూడదనే పనులు చెయ్యబోయి సామాన్లు ఎత్తేయడం, అదీ ఈ మధ్యనే. ఎప్పుడూ దైవచింతన, పరోపకారం-ఇదే ధ్యాస ఆయనకి. వైదేహి ఏమీ తోచక మావగారి గదిలోకి అడుగు పెట్టింది.

అంత వయసులోను ఆయన నిద్ర లేవగానే తన పక్క బట్టలు తనే మడత పెట్టుకుంటారేమో మంచం నీట్‌గా ఉంది. తలగడ దగ్గర రామకోటి రాస్తున్న పుస్తకం. ఆయనకి కళ్లు మాత్రం చక్కగా కనిపించడం వల్ల రోజూ రాత్రులు కాసేపు రామకోటి రాసుకుంటే తప్ప పడుకోరు. రామకోటి పుస్తకం పక్కనే బ్రౌన్ రంగు అట్టతో డైరీ మధ్యలో బాల్ పెన్ను. అవును, ఆయనకు డైరీ రాసే అలవాటుంది. తాతగారి అలవాటే కిరణ్‌కి కూడా వచ్చింది. అలవోకగా పేజీలు తిప్పుతున్న వైదేహి, ఆగిపోయింది. ఆమె కళ్లు అక్షరాల వెంట పరుగులు తీశాయి.

ఆ డైరీ అంతా ఆయన అత్తగారితో మాట్లాడుతున్నట్లే ఉంది. రాసేటప్పుడు చేతులు వణుకుతున్నాయో ఏమో, అక్షరాలు కుదురుగా లేవు. గజిగజిగా ఉన్నాయి.

'రాజ్యం నువ్వెంత దురదృష్టవంతురాలివే. చిన్నకోడలి ముచ్చట్లు చూడకుండానే వెళ్లిపోయావు. నన్ను కన్న కొడుకులా చూస్తోంది నీ కోడలు. నేను మందు వేసుకోకపోతే అరుస్తుంది. అన్నం సరిగా తినకపోతే లాలిస్తుంది. ఏదైనా వస్తువు ఎత్తేస్తే పగిలిన ముక్కలు నాకెక్కడ గుచ్చుకుంటాయో నని ఎంత బాగా కోప్పడుతుందనుకున్నావు! నేనూ అన్నంలోకి అన్నీ కావాలని అడిగి పేచీ పెట్టి మరీ చేయించుకుంటాను. ఎందుకో తెలుసా? అబ్బాయి ఊళ్లో లేడు కదా అని బిద్ధకించి రోజూ ఏ ఊరగాయతోనో సరిపెట్టుకుని తింటే, పిల్లలదీ, కోడలిదీ ఆరోగ్యం పాడైతే ఎంత కష్టం! అందుకే లోలోపల ముసిముసిగా నవ్వుకుంటూనే పిల్లల కిష్టమైన కూరలూ, అవీ చేయిస్తుంటాను. పాపం ఆపరేషన్ అయ్యాక నీరసపడిందిలే. అబ్బాయికి చెప్పి వంట మనిషిని పెట్టించాలనుకుంటున్నాను.

డెబ్బయి ఏళ్లకే ఆయనను భరించలేకపోతోందే... ఆయన ఆరోగ్యం గట్టిది, వందేళ్లు బ్రతికేస్తే తను చెయ్యగలదా? అని కూడా ఆలోచించింది పాపచింత లేకుండా. తన కొడుకే రేపు వార్ధక్యంలో తన గురించి అలా ఆలోచిస్తే??? ఆ ఊహకే ఎందుకో అమె వెన్ను లోంచి చలి పుట్టింది.

ఏమంటావ్ రాజ్యం?'

'రాజ్యం, నీకు గుర్తుందా? మనిద్దరం రామాయణంలో సీతాకల్యాణఘట్టం ముచ్చటగా చెప్పుకునేవాళ్లం కాదూ! జనకుడు సీత చేత శ్రీరాముడి పాణిగ్రహణం చేయిస్తూ ఏమన్నాడు?

'ఇయం సీతా మమ సుతా...
సహధర్మ చరీతైవ
ప్రతీక్షతైవ భద్రంతే
పాణి గృహ్ణేషు పాణినా'

ఈ నా బిడ్డ సీత... ఎప్పుడూ నిన్ను అనుసరించే ఉంటుంది. నీకు శుభం కలిగిస్తూ నీ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఈమె చేతిని నీ చేతిలోకి స్వీకరించవయ్యా రామ చంద్రా! అన్నాడు కదూ. తర్వాతి శ్లోకంలో కూడా ఆయనకు తన కూతురి గుణగణాల మీద ఎంత నమ్మకమో! నా బిడ్డ సీత గుణవంతురాలు. మన రెండు వంశాల గౌరవాన్ని ఇనుమడింపజేస్తుంది అంటాడు కదూ



కథా నిలయం శ్రీకాకుళం

'రాజ్యం, వైదేహి నాకు కోడలు కాదు, కూతురిలాగే కనిపిస్తుందే. అందుకే నేనూ అంటున్నాను... 'ఇయం వైదేహీ మమ సుతా' అని. నా మాటను నువ్వెప్పుడు కాదన్నావు కనుక! ఇదిగో చెప్పలేదనుకునేవు, అన్నట్టు మా తమ్ముడు పిలిచాడని రేపు వాడి షష్టిపూర్తికి బయలుదేరి వెళ్లుతున్నాను. ఈ నీరసంతో ప్రయాణం చెయ్యగలనో లేదో భయమేస్తోందే. అదీ గాక పాపం కోడలు ఒంటరిగా ఎలా చేసుకుంటుందో! నేను కూడా పిల్లలనూ, కోడలినీ విడిచి, ఇంత వరకూ ఎక్కడకు వెళ్లలేదే రాజ్యం! నీకు తెలుసుగా. అయినా తప్పదు. తమ్ముడూ పిలిచాడు, కోడలికీ కాస్త విశ్రాంతి...

'అన్నట్టు రామకోటి పూర్తయింది. మళ్లీ నన్నిక్కడకు రమ్మంటావా? అక్కడి నుండి అలాగే నీ దగ్గరకు పిలిపించుకుంటావా? నీ ఇష్టం. ఎందుకంటే మనిషికి అనారోగ్యం వచ్చిందంటే మాత్రం వార్ధక్యం శాపమే సుమా! రాజ్యం ఒక్క నిజం చెప్పనా? వాళ్లకు నా సాయం అవసర మున్నంతవరకే నేను బ్రతకాలని కోరుకునేది. ఇంక నేను వాళ్లకు భారం కాకుండా నన్ను నీ దగ్గరకు పిలిచే తరుణం వచ్చిందేమో అనిపిస్తోంది.'

డైరీ మూసేసినా వైదేహి కళ్లవెంట ముత్యాల్లా రాలిపోతున్నాయి అశ్రువులు. 'ఇయం వైదేహీ మమ సుతా! ఇయం వైదేహీ మమ సుతా!' పదే పదే ఆ పదాలు ఆమె హృదయంలో ప్రతిధ్వనిస్తున్నాయి. తనను కన్న కూతురులా భావించాడు మావగారు. తనెంత దుర్మార్గురాలు! ఆయన తనకు భారమని తలపోసింది. కాని పాపం, వృద్ధావస్థతో, అనారోగ్యంతో బలహీనమైన ఆయన చేతులు, ఈ యింటి కెంత రక్షణ నిస్తున్నాయి? అసలు మావగారు లేని ఇల్లు ఇల్లులా వుందా? కళాహీనమై పోలేదూ? పిల్లలు కూడా ఒక్క రోజు గడవకుండానే 'తాత ఎప్పుడొస్తారే అమ్మా' అంటున్నారు.

వైదేహి ఆలోచనల్లో మునిగిపోయిందేమో, తలుపు కొడుతున్న చప్పుడు వినిపించి ఉలిక్కిపడింది.

ఇంత రాత్రి పూట ఎవరు?

తలుపు తీసేసరికి ఎదురుగా మొహం పీక్కుపోయినా, చిరునవ్వులు చిందిస్తూ మావగారు, వెనక దూరబంధువు.

కోడలిని చూడగానే సుబ్బారావుగారు ఎక్కడ లేని ఓపికా తెచ్చుకుని, "అమ్మాయ్ వైదేహీ! షష్టిపూర్తి వేడుక వాయిదా పడిందటమ్మా. రైల్లో సగం దూరం వెళ్లగానే ఇదిగో ఈయన చేతిలోని సెల్ ఫోన్ తీసుకుని మా తమ్ముడితో మాట్లాడటం ఎంత మంచిదైందో చూశావా? ఇలా నేను బండెక్కగానే మన ప్రసాదుకి ఫోన్ చేసి చెప్పాడుట మీ పినమావగారు. ఇంక నాకు కాలు నిలవదేదమ్మాయ్. అప్పటికే సగం దూరం వెళ్లి పోయింది రైలు. ఇదిగో ఈయన మీ ఆడపడుచు బావగారి వియ్యంకు డికి మేనమావ అవుతారులే. పాపం దగ్గరుండి నాతో పాటు పక్క స్టేషన్లో దిగి తిరుగు బండిలో నన్ను తీసుకొచ్చి దిగబెట్టా రు. లోపలికి రండి బాబూ, మా వైదేహి కాస్త మజ్జిగ ఇస్తుంది. తాగి వెళ్దురు గాని.'

వచ్చినాయన మొహమాటపడుతూ అన్నాడు. వద్దు లెండి సుబ్బారావుగారూ! వ్యాపారం పనులున్నాయి. నేను వెంటనే బందరు వెళ్లి పోవాలి. చూడమ్మా మీ మావగారు నిన్నరాత్రి నువ్వు కట్టిచ్చిన పులిహోర తిన్నారు. బయటివేమీ కొనుక్కు తినలేదు కూడాను. అయినా అరగలేదు కాబోలు పాపం, ఒకటే విరేచనాలు. కాళ్లూ, చేతులూ చల్లబడి పోతూంటే భయపడిపోయాననుకో! ట్రెయిన్ లోనే అదృష్టవశాత్తూ నాకు తెలిసిన డాక్టర్ గారొకరు దొరికారు. నాలుగు టాబ్లెట్లు ఇచ్చారు. పక్క స్టేషన్లో కొబ్బరి బొండాలు కొని రెండుసార్లు ఇచ్చాను. తిరుగు బండి వచ్చేదాకా ఆ స్టేషన్లోనే ఉండిపోయాం. ఇప్పుడు బాగానే ఉన్నారనుకో. కాస్త జాగ్రత్తగా చూసుకోమ్మా. సుబ్బారావు గారూ, మళ్లీ వచ్చినపుడు మీ యింట్లో భోజనం చేస్తా లెండి. ఇప్పటికి నన్ను వదిలేయండి.'

వచ్చిన ఆయనను అలా పంపించి ఇలా హాల్లోకి వస్తున్న వైదేహి చెవులకి, భళ్లున ఏదో బద్దలైన చప్పుడు వినిపించింది. వెంటనే కిరణ్, తాతగారితో పోట్లాడుతున్న మాటలు... గోలగోల...

అయితే వైదేహి ముఖంలో కోపచ్ఛాయలు లేవు. అంతే కాదు, ఆ రాత్రి అంతా మనవడూ, మనవరాలితో మావగారి వాదులాటలూ, కేకలూ వినిపిస్తున్నా, వైదేహి ముఖంలో ప్రశాంతత చెదరలేదు.

ఆమె హృదయంలో ఒకటే శ్లోకపాదం పదే పదే ప్రతిధ్వనిస్తోంది.

'ఇయం సీతా మమ సుతా...'

ఇయం వైదేహీ మమ సుతా...

మర్నాడు తను టూర్ వచ్చి రాగానే, ఎప్పటిలాగా వైదేహి నుండి తండ్రి మీద కంప్లెయింట్లు వినబడకపోయేసరికి, ప్రసాద్ కళ్లల్లో రవంత ఆశ్చర్యం కదలాడినా, గుంభనగా తనలో తనే నవ్వుకున్నాడు.

'నాన్నా, నన్ను క్షమించు వైదేహిని నువ్వు కన్న కూతురిలాగే భావించినా, ఆ విషయం మాటల్లో ఆమెకు వ్యక్తం చెయ్యనక్కర లేదనుకునే భోళా మనసు నీది. అందుకే నీ డైరీలో చివరి పేజీ నేను రాశాను నాన్నా...'

వైదేహి 'ఏమండీ' అనీ, తండ్రీ 'ఒరేయ్ ప్రసాదూ' అంటూ ఒక్కసారే వచ్చేసరికి...

'ఇప్పుడు మావగారూ, కోడలూ ఒకటై, నా మీద దండెత్తుతారు కాబోలు!' అనుకున్నాడు ప్రసాద్.

●